సంపుటి: 3| సంచిక: 1

నవంబర్ - డిసెంబర్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

MERRY CHRISTMAS





# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

ప్రభువునందు ప్రియులైన వారికి శుభము అని చెప్పి వ్రాయునది. ప్రభువు యొక్క కృప మీకు తోడై యుండును గాక !

సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు మనకు తోడైయున్న దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసినవారమై యున్నాము. సర్వకృపానిధియైన దేవుడు ఆయన మహిమలో ప్రతి అవసరతను తీర్చుచు మనలను నడిపించుచున్నాడు. భూలోక నివాసులలో ఎందరో జ్ఞానవంతులు, ధనవంతులు అధికారము కలవారు ఉండగా ఏ యోగ్యత లేని నన్ను ఎందుకు రక్షించాడా అని ఆలోచించినప్పుడు, ఆయన సంకల్పము అర్థం చేసుకొనుటకు నా జ్ఞానము సరిపోదు అని అనిపిస్తుంది. ఏది ఏమైనా ఆయన రక్షకుడు, మన పాపములను క్షమించుటకు, మన పాపముల శిక్ష అంతటిని ఆయన సిలువలో భరించాడనే సంగతి ఎంతో ఆశ్చర్యము, అద్భుతము. తనను విశ్వసించిన ప్రతి ఒక్కరిని రక్షించి, చెప్పశక్యము కాని మహిమాయుక్తమైన సంతోషమును కలిగిస్తాడు.

అయితే ఇంకా ఎందరో ఈ అనుభవము లేని వారు సమాజములో ఉన్నారు. అదే విధంగా క్రైస్తవులు అని అనబడే వారిలోను ఉన్నారు. ఇంత గొప్ప సంతోషమును లేక రక్షణ భాగ్యమును వారి జీవితములలో కూడా పొందుటకు మనము ప్రయాసపడవలసి ఉన్నది. మన ముందు తరములలో ఎందరో శక్తివంచన లేకుండా ప్రయాసపడుట ద్వారా మనము ఈ రోజున నెమ్మది అనుభవించుచున్నాము. మనము ప్రభువు నందు పడు ప్రయాస వ్యర్థము కాదని బైబిల్ గ్రంథము సెలవిచ్చినది కనుక మనము ఇచ్చే సాక్ష్యము, చెప్పే దేవుని మాటలు తప్పకుండా రాబోయే రోజులలో అనేకులకు ఆశీర్వాదకరముగా మారగలవు.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 1 నవంబర్ - డిసెంబర్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- నేర్చుకొనుట ............ 2
- బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు ............ 5
- సఖ్యతతో ఐక్యత (స్త్రీల ప్రత్యేకం) ............ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 37వ భాగము ............ 9
- సహాయం (బాలల శీర్షిక) ............ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ............ 13
- విశ్వాసంలో ఎదుగుట ............ 15
- నిజమైన క్రిస్మస్ ............ 18
- ప్రార్థనా శక్తి ............ 20
- బైబిల్ క్విజ్-37 ............ 22
- జన్మదిన శుభాకాంక్షలు ............ 23


మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227



# నేర్చుకొనుట

- బ్రదర్. ఎపఫ్రా

*నేనేస్థితిలో ఉన్ననూ ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను.ఫిలిప్పీ4:11*

సంతృప్తి కలిగిన వారి కంటే ధనవంతులు ఈ సృష్టిలో ఎవరూ లేరు. దేవుడు సృజించిన జీవరాశులలో పక్షులు ఆకాశంలో, చేపలు నీటిలో, జంతువులు అడవులలో సంతృప్తి కలిగి ఉన్నట్లుగా కనిపిస్తాయి. మరి మానవుని విషయంలో సంతృప్తి కలిగి ఉండుట అనేది ఏ విధంగా చూచిననూ కనబడదు. ఒక రకంగా అసంతృప్తి కలిగి ఉండడం అనేది దేవుని మీద తిరుగుబాటు చేయడం లాంటిది. సంతృప్తి కలిగి ఉండటం నేర్చుకొనవలసిన విషయము అని బైబిల్ గ్రంథం తెలియచేస్తుంది. ఒక వ్యక్తి ప్రతి రోజూ ఉదయమునే కొండకు వెళ్ళి కొండలోనుండి కొన్ని రాళ్ళు చెక్కుకొని వాటిని అమ్ముకొని సంతోషంగా జీవించేవాడు. అలా దినములు సంతృప్తిగా వెళ్ళబుచ్చేవాడు. ఒకరోజు ఒక ప్యాలస్‌లో రాళ్ళు కొట్టడానికి తీసుకువెళ్ళారు. ఈ వ్యక్తి రాళ్ళు కొడుతూ ఉండగా ప్యాలస్ యజమాని నీడలో కూర్చుండుట చూచి నాకు ప్యాలస్ ఉంటే బాధలు ఉండవుకదా అని అనుకుంటాడు, అతనికి ప్యాలస్ ఇవ్వబడుతుంది. ఆ ప్యాలస్‌లో రోజూ కూర్చొని ఉండుట ద్వారా విసుగు చెందుతూ రాజ్యమును పరిపాలిస్తున్న రాజు గుఱ్ఱం మీద వీధులలో తిరుగుచుండగా అది చూసిన ఈ వ్యక్తి, రాజుగారిని ఇంతమంది వెంబడిస్తున్నారు, ప్యాలస్‌లో కూర్చోవటం కంటే రాజునైతే బాగుండును అనుకున్నాడు. రాజుగా మారి రోజూ గుఱ్ఱం మీద వీధులలో తిరుగుచూ ఉండగా ఎండ వేడిమిచేత అలసట చెంది ఈ జీవితం కంటే సూర్యుడిగా మారితే ఏ కష్టములు ఉండవు అనుకున్నాడు. సూర్యుడిగా మారిన తరువాత ఒక రోజు మేఘములు సూర్యుని యొక్క ప్రతాపమును అడ్డుకోవడం చూచి, సూర్యుని కంటే మేఘములుగా ఉండటమే మేలు అనుకొని, మేఘములుగా మార్పుచెంది సంతోషంగా ఉంది అని అనుకునే లోపు బలమైన గాలి వీచి మేఘములు తాకటం ద్వారా, మేఘములు కంటే గాలి గొప్పదని అనుకొని గాలిగా మార్పుచెంది నేను చాలా పవర్‌ఫుల్ అనుకొంటుండగా ఒక రోజు ఎంత బలంగా గాలివీస్తున్నా, కొండ రాళ్ళలో చలనం లేకపోవడం చూచి, నా కంటే కొండరాళ్ళే బలమైనవి అనుకొని కొండరాళ్ళుగా ఉంటేనే బాగుండును అనుకున్నాడు. కొండరాళ్ళగా ఉంటుండగా ఒక రోజు ఉదయమునే కొండరాళ్ళని కొట్టడానికి ఒక మనుష్యుడు వచ్చి రాళ్ళని ముక్కలు ముక్కలుగా కొడుతుండగా కొండరాళ్ళ కంటే దానిని కొట్టే వ్యక్తిగా ఉండటమే శ్రేష్ఠము అనుకున్నాడు.

ఈ ఉపమానం మానవుని జీవితంలో సంతృప్తి లేకుండా జీవించే జీవితమునకు అద్దం పడుతుంది. మనం ఏ స్థితిలో ఉన్నప్పటికి ఆ స్థితిలో కొన్ని ఇబ్బందులు, సమస్యలు ఉండటం, అదే సమయములో మేలులు, అనుకూల అంశములు ఉండడం సాధారణం. కాబట్టి మనము ఉన్న స్థితిలో సంతృప్తి కలిగి ఉండటం కంటే భాగ్యం మరొకటి లేదు.

 **సోమరితనం అన్నింటికీ కష్టాన్ని కలిగిస్తే, శ్రమ అన్నింటినీ తేలిక చేస్తుంది.**

**ఈ క్రింది నాలుగు స్థితిగతులలో మనం ఏ విధంగా ఉండాలో తెలుసుకుందాము.**

**1. ఆరోగ్య స్థితి** (Health status)

నేటి సమాజములో వ్యాధులు అనేవి చాలా సర్వసాధారణమైనవి. చిన్నతనము నుండే పిల్లలకు కళ్ళద్దాలు అవసరం అవడం, కొంచెం పెరిగి పెద్దవారయ్యేసరికి హైపర్‌టెన్షన్ (B.P.), మధుమేహం (Sugar), మరియు ఇతర ఆరోగ్య సమస్యలు, వీటన్నిటికి కొన్నిసార్లు మన ఆహారపు అలవాట్లు కారణమైతే మరికొన్నిసార్లు వంశ పారంపర్యంగా సంక్రమిస్తున్నాయి. క్రైస్తవ సమాజంలో ఒక అపోహ బలంగా నాటుకుపోయింది, అదేమిటంటే పాపాత్ములకే వ్యాధులు వస్తాయని, వ్యాధిగ్రస్తులు నీతిమంతులుకారని అనుకుంటూ ఉంటాము. పాపము వలన వచ్చు జీతము మరణము అని బైబిల్‌లో వ్రాయబడినప్పటికి, వ్యాధులను బట్టి మంచివారు, చెడ్డవారు అని తీర్పుతీర్చలేము. మన ఆరోగ్య స్థితి ఏదైనప్పటికి ఆ స్థితిని బట్టి అసంతృప్తితో నిరాశ చెందక ప్రార్థించుకొనుచు మరియు ఆహారపు అలవాట్లు ద్వారా నెమ్మది కలిగి జీవించెదము.

**2. ఆర్థిక స్థితి** (Financial status)

నేడు సమాజమును ఎంతగానో ప్రభావితం చేస్తున్నది ఆర్థిక స్థితి. ఆర్థిక పరిస్థితులలో మనుష్యులు సంతృప్తి కలిగి ఉండుట నేర్చుకొనక తీసుకునే నిర్ణయములను బట్టి సమాజములో ఎన్నో అనర్థములు కలుగుచున్నాయి. ఒక మనుష్యుడు తన అవసరతల కంటే మించి ఎక్కువ కావాలని కోరుకోవడం విచిత్రంగా అనిపిస్తున్న వాస్తవం. ప్రతి మనుష్యుడు ఆర్థిక విషయములలో సంతృప్తి కలిగి ఉండగలిగితే మనము ఒక క్రొత్త ప్రపంచము చూడగలుగుతాము. బైబిల్ గ్రంథములో పౌలు భక్తుడు దీనస్థితిలో ఉండనెరుగుదును, సంపన్న స్థితిలో ఉండనెరుగుదును అనే ఒక అద్భుతమైన సత్యమును తెలియపరచుట జరిగింది. సంపద సమాజమును ఎంతో ప్రభావితం చేస్తుంది. నిజక్రైస్తవుడు తన జీవితంలో ఎల్లప్పుడూ అన్నవస్త్రములు గలవారై తృప్తి చెంది ఉండాలనేది దేవుని ఉద్దేశ్యం - 1 తిమోతి 6:8. మన జీవితంలో శ్రేష్ఠమైన వాటిని కోరుకోవడంలో తప్పులేదు అయితే మనము ఉన్న స్థితిని బట్టి అసంతృప్తి కలిగి ఉండకూడదు.

**3. సామాజిక స్థితి** (Social status)

మనిషి జీవితంలో కావలసిన ఆహారం, వస్త్రములను దేవుడు అనుగ్రహించినప్పటికీ, సామాజిక హోదా కొరకు ఎంతగానో వెంపర్లాడటం కనబడుతుంది. సామాజిక హోదా కొరకు తమకి కలిగిన వాటిని మాత్రమే కాక ప్రాణములను కూడా పోగొట్టుకొనిన వారు ఎందరో ఉన్నారు. చరిత్రలో సామాజిక హోదా కొరకు ఎన్నో యుద్ధములు, పోరాటములు జరుగుట మనము చూస్తాము. మంచి సామాజిక హోదా కలిగి ఉండాలని ఆశించడం తప్పు అని

అనలేము కానీ ఉన్న స్థితిలో అసంతృప్తి కలిగి ఉండడం, ఖచ్చితంగా దేవునికి దుఃఖమును కలిగించడమే. అసంతృప్తి కలిగి ఉండుట వలన సామాజిక హోదాలో ఎటువంటి మార్పు ఉండకపోగా, మన ఆనందమును ఎంతో పాడు చేస్తుంది. సమాజం మనలను గౌరవించే విధానమును బట్టి మన వ్యక్తిత్వం మార్పు చెందకూడదు. మనము స్థిరమైన వ్యక్తిత్వం గల వారమై యుండి మనము ఉన్న సామాజిక స్థితిలో సంతోషించే వారిగా ఉండాలి. ఒకానొక సమయంలో రాజైన దావీదు ప్రజలందరి వలన ఎంతో ఘనత పొందినవాడైనప్పటికి, ఒక దినమున షిమి అనే సామాన్యమైన వ్యక్తి నరహంతకుడా! దుర్మార్గుడా! ఛీ ఫో, ఛీ ఫో అని దూషిస్తున్నప్పటికీ, అసంతృప్తితో అతనిని శిక్షించిన వాడు కాదు కానీ, చుట్టూ ఉన్నవారు శిక్షించెదమని అన్నప్పటికీ దేవుడే తనను దూషణలకు అప్పగించాడేమోనని సంతృప్తి చెందినట్లుగా మనము చూస్తాము.

**4. ఆత్మీయ స్థితి** (Spiritual status)

ఒక మనుష్యుడు నూతన జన్మ అనుభవములు కలిగి ఉండుట ద్వారా ఆత్మీయ స్థితి ప్రారంభమవుతుంది. ఆత్మలో తగ్గటం, ఎదగటం ఆత్మీయ జీవితంలో సాధారణమైనవే. అయితే ఆత్మలో అంతకంతకూ ఎదగాలని మనము కోరుకోవాలి కానీ వేరొకరితో సరిపోల్చుకుంటూ అసంతృప్తి కలిగి ఉండకూడదు. మనకి అనుగ్రహించిన కృప చొప్పున వేర్వేరు కృపావరములు కలిగి ఉన్నాము కానీ ఘనమైనదని, హీనమైనదని భావించటం సమంజసం కాదు. బైబిల్ గ్రంథములో యేసుప్రభువు చెప్పిన అనేక ఉపమానములను మనం పరిశీలిస్తే, తనని తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును, తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు, తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను అని బైబిల్ గ్రంథములో యేసుప్రభువు అనేక ఉపమానములు చెప్పటం జరిగింది. మన ఆత్మీయ స్థితిని బట్టి ఎన్నడు అసంతృప్తితో జీవించకుండా, ఉన్న ఆత్మీయ స్థితిని బట్టి సంతృప్తి కలిగి, మనం కోరుకునే ఆత్మీయస్థితిని గూర్చి నిరీక్షణ కలిగి ఆనందముతో జీవించవలసిన వారమై యున్నాము.

ప్రియమైన చదువరీ! అన్ని విషయములలో సంతృప్తి కలిగి ఉండడం అనేది నేర్చుకొని ఉన్నాను అని పౌలు భక్తుడు చెప్పినట్లుగా, మనము కూడా సంతృప్తి కలిగి యుండుట నేర్చుకొనవలసి ఉన్నది. సంతృప్తి కలిగి ఉండుటలో ఎంతో గొప్ప ఆనందం ఉన్నది. సంతృప్తి కలిగి ఉండుట అనగా అసమర్థత, చేతకానితనం అనుకుంటే పొరపాటు. అసంతృప్తితో మనం ఉండుట వలన మన సామర్థ్యం తగ్గిపోతుందే కానీ, ఎక్కువ కాదు. మంచి నిర్ణయములు తీసుకొనవలసిన సమయములో చెడ్డనిర్ణయములు తీసుకుంటాము. కఠినమైన మాటలు పలుకుతూ ఉంటాము. సంతృప్తి కలిగి ఉండుట నేర్చుకొనుట ద్వారా మన ప్రాణమునకు నెమ్మది దేవుని దృష్టిలో నిర్దోషులముగా ఉండగలుగుతాము. అట్టి ధన్యతను దేవుడు మనకి దయచేయును గాక !

# బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు

21. దావీదు యెరూషలేముపై దండెత్తుట మరియు దేవుని నిబంధన మందసమును స్వాధీనపరచుకొనుట - 2 సమూ 5,6

22. దేవుడు దావీదుతో నిబంధన చేయుట - 2 సమూ 7:8-17

23. సొలొమోను పట్టాభిషేకము - 1 రాజు 1:39

24. సొలొమోను దేవుని మందిర నిర్మాణము పూర్తి చేయుట - 1 రాజు 6:38

25. ఇశ్రాయేలు సామ్రాజ్యము - ఇశ్రాయేలు, యూదా అను రెండు రాజ్యములుగా విడిపోవుట -1 రాజు 12

26. ఏలీయా పరలోకమునకు ఆరోహణమగుట - 2 రాజు 2

27. దుష్టరాణియైన అతల్యా నుండి యోవాషు రక్షించబడుట - 2 దిన 22:10-12

28. ఉత్తర సామ్రాజ్యముపై అషూరీయుల విజయము - 2 రాజు 17:6

29. అషూరీయుల నుండి యెరూషలేమునకు విడుదల - 2 రాజు 19:32-35

30. యోషీయా పరిపాలనా కాలములో ధర్మశాస్త్రముగల గ్రంథము దేవుని మందిరములో దొరుకుట - 2 దిన 34:8-32

31. సొలొమోను నిర్మించిన దేవుని మందిరము నాశనము చేయబడుట - 2 రాజు 25:8,9

32. దక్షిణ సామ్రాజ్యపు వారిని బబులోనుకు చెరగొని పోవుట - 2 రాజు 25:11

33. రాజైన కోరెషు ప్రకటనకు యూదులందరు తిరిగి వచ్చుట - ఎజ్రా 1

34. జెరుబ్బాబెలు నాయకత్వమున యెరూషలేములో నూతన దేవుని మందిర నిర్మాణము పూర్తి అగుట - ఎజ్రా 6

35. ఎస్తేరు ద్వారా పారశీక దేశములో యూదులందరు రక్షింపబడుట - ఎస్తేరు 4-7

మరికొన్ని వచ్చే సంచికలో



# సఖ్యతతో ఐక్యత

- సిస్టర్ వి.విజయ

అసూయ ముందు పుట్టి తరువాత ఆడది పుట్టింది అని మన తెలుగులో ఉన్న సామెత.  మహోన్నతుడైన దేవునిని ఆరాధించే స్త్రీలు ఎంతో భిన్నంగా ఉండవలసి ఉంది. అయితే వారిలో సైతము అసూయతో కూడిన ప్రవర్తన కనబడడం శోచనీయం. మన ఎదుటే మన తోటి స్త్రీలను ఘనపరచినప్పుడు లేక వారి మంచితనమును గూర్చి ప్రశంసిస్తూ మాట్లాడినప్పుడు అసూయతో లోలోపల క్రుళ్ళిపోయే మనస్తత్వం కొంతమందిది అయితే, ఈ స్థాయిని కూడా దాటి ఎదుటివారిని దూషించే స్థితికి వెళ్ళిపోతుంటారు మరికొందరు. ఈ విషయములో ప్రతి స్త్రీ గమనించవలసినది ఏమిటంటే, ప్రతి స్త్రీ కొన్ని విషయములలో మెరుగుగా ఉండుట మరికొన్ని విషయములలో బలహీనంగా ఉండుట సహజమైన విషయం. ఏ ఒక్కరూ అన్ని విషయములలోను బలవంతులు కారు. అలా అని బలహీనులు కారు. కొందరు కొన్ని విషయములలో బలవంతులైతే, మరికొందరు మరికొన్ని విషయములలో బలవంతులు. అనేక సందర్భములలో మన కంటే ఏదో ఒక విషయములో ఎదుటివారు మెరుగుగా లేక మంచిగా ఉంటారని ప్రతి స్త్రీ గుర్తించినట్లైతే అసూయని దూరం చేసుకునే అవకాశం ఉంటుంది.

నేటి దినములలో ఏ ఇద్దరు స్త్రీలు కూడా కలిసి సఖ్యతగా, ఐక్యతతో నిలిచి ఉండలేని స్థితి. ఒకరంటే ఒకరికి అభిమానం, ఒకరి మాటల మీద మరియొకరికి గౌరవం అనేవి కనుమరుగైపోతున్నాయి. ఈర్ష్య, ద్వేషము, ఒకరితో ఒకరు గొడవపడే మనస్తత్వములు మనం చూస్తున్నాము. ఒకే కుటుంబములో లేక ఒకరితో ఒకరు ఉన్ననూ ఓర్వలేని స్థితి కనబడుతుంది.

బైబిల్ గ్రంథములో నుండి మన ధ్యానభాగమైన ఇద్దరు స్త్రీలు ఏ విధంగా ఒకరిని ఒకరు ఆదరించుకుంటూ, దేవునిలో సంతోషంగా గడిపారో చూద్దాము.

**ఆ దినముల యందు మరియ లేచి యూదా ప్రదేశములోని కొండసీమలో ఉన్న ఒక ఊరికి త్వరగా వెళ్ళి । జెకర్యా ఇంటిలో ప్రవేశించి, ఎలీసబెతుకు వందనము చేసెను - లూకా 1:39,40**

ఇక్కడ చెప్పబడిన స్త్రీలలో ఒకరు యేసుప్రభువునకు ముందుగా ఆయన మార్గములను సిద్ధపరుచుచు, పాపక్షమాపణ నిమిత్తమై మారుమనస్సు విషయమైన బాప్తిస్మము ప్రకటించడానికి దేవుని చేత పంపబడిన యోహానుకి జన్మనిచ్చిన తల్లియైతే, మరొకరు పరిశుద్ధాత్మ ద్వారా గర్భము ధరించి లోకరక్షకుడైన యేసుప్రభువుకి జన్మనిచ్చిన తల్లి.

వీరి ఇరువురి జీవితములను పరిశీలించినప్పుడు, మొదటగా **ఎలీసబెతు గొడ్రాలైనందున వారికి పిల్లలు లేకపోయిరి. మరియు వారిద్దరు బహుకాలము గడిచిన వృద్ధులైరి. - లూకా 1:7**

ఎలీసబెతు భర్తయైన జెకర్యా యెహోవా మందిరములోని యాజకుడు. ఎలీసబెతు అహరోను కుమార్తెలలో ఒక కుమార్తె. ఈమె వృద్ధురాలై, గొడ్రాలిగా ఉన్ననూ - తనకి ఉన్న అవసరత తీర్చబడలేదు అని నిరాశగా, మందత్వముతో లేదు కానీ అప్పగించిన బాధ్యతను విడిచిపెట్టక ముందుకు కొనసాగించింది.

**వీరిద్దరు ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయ విధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి. - లూకా 1:6**

ఆ సమయములో దేవుని దూత జెకర్యాని దర్శించుట వలన అతని భార్యయైన ఎలీసబెతు గర్భము తెరవబడింది. ఇంక మరియ జీవితములో వివాహము కాక మునుపే పరిశుద్ధాత్మ ద్వారా నీవు గర్భము ధరిస్తావు అని దేవుని దూత చెప్పటం జరిగింది. ఆమె దూతతో మాటలాడిన తరువాత పైన వ్రాయబడిన వాక్య ప్రకారం మరియ లేచి ఎలీసబెతు దగ్గరికి వెళ్ళెను. మరియ వెళ్ళేటప్పటికి ఎలీసబెతు 6వ నెల గర్భముతో ఉన్నది, మరియ వందన వచనము ఎలీసబెతు వినగానే ఆమె గర్భములోని శిశువు గంతులు వేసెను.

ఎలీసబెతు వయసులో పెద్దది, అనుభవం కలిగినది. మరియ వివాహం కాకుండా గర్భము ధరించిన స్త్రీ - ఈ విషయం బయటికి తెలిసినపుడు, అందరూ అనుకూలముగా ఆలోచించరు కానీ, ఎన్నో హేళనలు, అవమానములు, నిందలు, ఛీత్కరింపులు వస్తాయి. వీటన్నిటిని భరించడానికి ధైర్యము, దేవుని యందలి శక్తి అవసరం. అవి ఎలీసబెతు మాటల ద్వారా మరియకు లభించాయి. మరియ కనిపించిన వెంటనే ఎలీసబెతు పరిశుద్ధాత్మతో నిండుకొని, బలమైన మాటలను ప్రకటించడం జరిగింది. **అంతట మరియ, యించుమించు మూడు నెలలు ఆమెతో కూడ ఉండి, పిమ్మట తన ఇంటికి తిరిగివెళ్ళెను. - లూకా 1:56**

3 నెలల కాలములో ఎన్నో విషయములు వారిద్దరి మధ్య వచ్చి ఉండవచ్చు. ఒకరి మాటల ద్వారా ఒకరు ప్రోత్సాహమును, ఆదరణని, ధైర్యముని పొందుకున్నారు. ఇద్దరు కలిసి ప్రార్థించారు, కలిసి పాడారు, సంతోషించారు, దేవుని స్తుతించారు. మరియ గర్భములో నుండి పరిశుద్ధాత్మ ద్వారా జన్మించబోతున్న లోకరక్షకుని ఎలీసబెతు గ్రహించింది. మరియ చిన్నది, కానీ లోకరక్షకుడైన ప్రభువు నా గర్భములో ఉన్నాడు అని గర్వించలేదు. ఎలీసబెతు పెద్దదైనా మరియను చూచి అసూయపడలేదు, తనని తాను తక్కువగా ఎంచుకొనలేదు. ఇద్దరి మధ్య ఆత్మను నీరసింపజేసే, నొప్పించే మాటలు లేవు. ఒకరి తప్పులను ఒకరు ఎంచుకోలేదు, వేరొకరిని గురించిన మాటలే ఇద్దరి మధ్య లేవు. ఈర్ష్య, ఓర్వలేనితనము ఏవీ

లేవు కానీ దేవుడు తమకు ఇచ్చిన స్థానమును అంగీకరించి, ఆ స్థానములో సంతోషించి, శక్తి కొలది దేవుని కార్యమును నెరవేర్చడానికి ముందుకి వెళ్ళుచూ, ఒకరి యొద్ద ఒకరు నేర్చుకున్నారు.

ముఖ్యముగా నేను మీతో పంచుకోవాలని అనుకున్నది మరియ, ఎలీసబెతుల మధ్య ఉన్న ఆ చక్కటి సంభాషణ, సమాధానకరమైన సంబంధం గురించి మాత్రమే. మనము మన కుటుంబములతో, మన తోటివారితో ఏ విధమైన సంబంధములను కలిగి ఉంటున్నాము ? దేవుని మేలులను తలంచుచూ, మనలను దేవుడు ఎలాంటి పరిస్థితుల మధ్యలో ఉంచిననూ లేక మన చుట్టూ ఉన్నవారు ఏవిధముగా ఉన్నప్పటికీ వారితో ఐక్యత కలిగి జీవించుటకు ప్రయత్నించవలయును. దేవుని జ్ఞానము కలిగిన స్త్రీలుగా మంచి వారితో మాత్రమే మంచిగా ఉండుట కాక, ఎలాంటి దుందుడుకు స్వభావం గలవారితోనైనా లేక ఎవ్వరూ వారితో భరించలేరు అనే స్వభావము గలవారితో అయినా సఖ్యత కలిగి జీవించవలయును. అప్పుడు దేవుని ఔన్నత్యము మన జీవితాల ద్వారా సమాజములోను, కుటుంబములోను వెల్లడి అవుతుంది. యేసయ్య మనము లోకమునకు వెలుగు అని, మరియొక సందర్భములో ఉప్పు అని చెప్పిన మాటలు నెరవేరతాయి.

ఇట్టి ధన్యతను ప్రభువు మనకు అనుగ్రహించును గాక !


**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---

ప్లాట్ నెం.1, శాంతినగర్, భార్గవలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

---

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు
కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 37వ భాగము**

1917 జూలై 13న వెలువడిన డా.వెర్రీ గారి వారపత్రికకిచ్చిన వ్యాసములో కైలాసపర్వతం తన ఊహాజనితమైనది కాదని తెల్పుచూ, ఆ పర్వతం ఎక్కడ, ఎలా ఉంటున్నదనేది వివరంగా వ్రాశాడు సుందర్.

కైలాస పర్వతం పశ్చిమ టిబెట్‌లో ఉన్నది, రక్షణ సైన్యం వారి హాస్పిటల్‌కి దగ్గరలో ఉన్న చీనాకి ఇటు డెహ్రాడూన్‌కు మూడు వందల మైళ్ళ దూరములో కైలాస పర్వతము ఉన్నది. కైలాష్‌లోని అత్యున్నత శిఖరం సముద్ర మట్టానికి 21,850 అడుగుల ఎత్తులో నుండి ఎల్లప్పుడు మంచుతో కప్పబడి యున్నది. ఒక ఆలయంపైన సిలువ ఉన్నదన్నట్లుగా ప్రకృతే ఈ శిఖరమును రూపుదిద్దినది. ఈ ప్రాంతం ఎంతో సౌందర్యంగా ఉన్నది. అందుచేతనే మహర్షి తన ప్రార్ధనకు ఈ పర్వతాన్ని ఎన్నుకున్నాడు. భారతీయులు, చైనావారును కైలాష్‌ను దేవతల నివాసంగా భావించి దానిని పరదైసు అంటుంటారు.

దేవుని మార్గములు అగమ్యగోచరములు. కొందరిది అసాధ్యమనుకోవచ్చును గాని మంచుతో నిండిన ఈ చల్లటి స్థలములో ఎన్నో వేడి నీటి ఊటలున్నాయి. అలాగే ఇంత చల్లని ప్రాంతములో అదీ శీతాకాలములో ఆ మహర్షి అక్కడ ఉండడం కూడ అసాధ్యమని కొందరనుకోవచ్చు గాని అక్కడ వేడి నీటి ఊటలు, మహర్షి ఉన్నారనేది వాస్తవం. నమ్మలేని వారు స్వయంగా వెళ్ళి చూస్తే మంచిది. పితోరాఘర్ నుండి కైలాష్‌కు వెళ్లాలంటే వారం రోజులు పడుతుంది. నేను వేగంగా అంటే 3 రోజుల్లో వంద మైళ్లు నడవగలను గాని ఇతరులకైతే ఈ ప్రయాణం నెలరోజులు పట్టవచ్చు. దగ్గర్లోని స్టేషన్ నుండి పితోరాఘర్‌కి 63 మైళ్ళు, సాహస యాత్రికులు ఉత్తర, దక్షిణ ధృవ ప్రాంతాలకు ప్రయాణం చేశారు గనుక అలాంటి వారికి కైలాష్‌ను దర్శించడం పెద్ద కష్టం కాదు. కాబట్టి రండి అని సవాలు కూడా చేశాడు సుందర్.

15 రోజుల తరువాత డా.వెర్రీగారి పత్రికకు మరో వ్యాసాన్నిచ్చాడు సుందర్. ఈసారి తీర్ధ యాత్ర చేస్తూ కైలాష్‌కు వెళ్ళుచున్న టిబెట్ లామాను కలిసికొని మహర్షి దగ్గరకి ఎలా తీసుకుని పోయిందీ వివరించాడు. గోరీకోండ్ మీదుగా కైలాష్ తూర్పున నడిచి సేలయేరు దాటి కొండలను ఎక్కాము. ఆ మంచు కొండలపై ఎన్నో రమణీయ దృశ్యాలను చూస్తూ కూడా తీవ్రమైన చలి వలన పెదవులు కదలక ఒక్క మాట కూడ మేము మాట్లాడుకోలేదు. మరుసటి

సాయంత్రం మా గమ్యమును చేరాము. మేము వెళ్ళేసరికి చేతిలో వ్రాసిన ప్రాచీన గ్రీకు గ్రంథమును మహర్షి చదువుచున్నాడు. మేమిద్దరము మర్యాదపూర్వకంగా మహర్షికి నమస్కరించి కూర్చున్నాము. మహర్షిగారు యోహాను సువార్త నుండి 3 అధ్యాయములు చదివి వినిపించడంతో మా సంభాషణ ఆరంభమైనది.

నేను క్రీస్తుప్రభువు దీనదాసుడను, ప్రార్థించుకుంటున్నాను. ఈ లోకము గొడవలతో నిండి ఉన్నది. వీటికి మూల కారకుడైన సాతానును చెరపట్టి బంధించేంత వరకు ఈ కొట్లాటలు ఆగవు. నాశనమనే అగాధ కూపంలోనికి సాతానును నెట్టిపడవేసే సమయం ఆసన్నమైనదని చెప్పాడు మహర్షి. ఈ సంఘటనలో మహర్షి చెప్పిన మరెన్నో మాటలను వ్రాశాడు సుందర్. ఈ మహర్షిని గూర్చి సుందర్‌ను అడుగుదామని ఎందరో ప్రజలు ఎప్పుడూ ఆయన చుట్టూ గుమిగూడేవారు. కాగా చివరకు ఇలా ప్రశ్నించేవారికి సుందర్ ప్రత్యుత్తరమివ్వడం మానుకున్నాడు. ఈ లోకములో క్రీస్తును ప్రకటించడమే నా పని గాని మహర్షిని కాదు అన్నాడు సుందర్.

ఈ లోకములో సుందర్ చేయాల్సిన పని తాను తలంచినదాని కంటెను, ఊహించినదాని కంటెను ఎంతో విస్తారమైనదని అతనికి తెలియదు. ఇప్పటివరకు అతని సువార్త ప్రకటన కార్యకలాపములన్నీ ఉత్తర భారత దేశమునకు, విస్తృతమైన హిమాలయ పర్వత ప్రాంతములకే పరిమితమైపోయాయి. 1917వ సంవత్సరాంతములో సుందర్ బరోడాలో ఉన్నాడు. మరుసటి రోజు ఉదయం 5గం॥ల బండిలో సబాతుకు వెళ్ళాలనుకున్న సుందర్ ప్రణాళిక అంతా అకస్మాత్తుగా మారిపోయింది. అతడు పరవశుడైయుండగా దక్షిణ భారతదేశమునకు వెళ్ళమనే ఆజ్ఞ వచ్చింది. అనుకోని విధంగా ఇది జరిగినప్పటికిని దేవుడే తనకి ఆజ్ఞాపించాడని సుందర్‌కు తేటగా తెలిసింది. కాబట్టి అతడు వెళ్ళి తాను 5 గంటల బండికి వెళ్ళడం లేదని తనకి ఆతిథ్యమిచ్చిన వారితో చెప్పాడు. అలా చెప్పిన కొద్ది గంటలలోనే దక్షిణ భారతదేశానికి రండని తననాహ్వానించుచున్న తంతివార్త నందుకున్నాడు సుందర్.

సుందర్‌కి తెలియకుండానే ఆయన పేరు దక్షిణ భారతదేశమంతా తెలిసిపోయింది. డా.వెర్రీగారి పత్రిక ద్వారానే గాక సుందర్ అంటే ఎంతో గొప్ప అభిమానం గల ఆగ్రాలో ఉన్న ఒక హాస్టల్ వార్డెన్ సుందర్‌ను గురించి వ్రాసిన దానిని బట్టి కూడా సుందర్ పేరు ప్రజలకు తెలిసిపోయింది. ఉత్తర భారతదేశములోనైతే సువార్త ప్రకటన కొరకైన అవకాశములు నెమ్మదిగా దొరికాయి గాని దక్షిణ భారతదేశములోనైతే త్వరగాను, విస్తృతంగాను లభించాయి. తన్ను తాను తగ్గించుకున్న తన జీవితములో పొగడ్తలు, ప్రజాదరణలు దొరికి తన శిష్యత్వం యొక్క వాస్తవికతను పరీక్షించే నూతన అధ్యాయం ప్రారంభమైనదని భావించాడు సుందర్.

ఇంకా ఉంది (సేకరించబడింది)

# సహాయం



Hai Children! How are you? అబ్బా! చలి Start అయ్యింది కదా! చలిలో తిరగకండి. మీ Parents చెప్పినట్లు చెయ్యండి. Christmas కూడా వచ్చేస్తుంది కదా! మీరంతా Busy ఏమో? ఒక ప్రక్కన .Schoolకి వెళ్ళాలి, Shopingకి వెళ్ళాలి ఇంకా ఏమో... Sunday School Programsకి Prepare అవ్వాలి, ఇంటిని Lightingsతో Starsతో అలంక రించాలి. అబ్బో చాలా busy కదా పిల్లలూ !

ఈ Decorationలో 'Christmas Tree'ని భలే అలంకరించుతారు. దాని పేరు 'For Tree'.... ఆ Tree వెనుక అనేక Storyలు ఉన్నాయట్రా Exampleగా ఒక Story చూద్ధామా !!

ప్రభువైన యేసుక్రీస్తు జన్మించినప్పుడు సృష్టి అంతా పులకరించిపోయిందట. యేసయ్య జన్మించిన ఆ దినమున ఫలించు ప్రతి చెట్టు బహుగా ఫలించి, పుష్పించు ప్రతిమొక్క బహుగా పుష్పించి ఎంతో అందముగా తమతమ ఫలములు, పుష్పములచేత అలంకరించుకొని యేసయ్యను స్తుతిస్తూ సృష్టంతా సంబరములలో మునిగియున్నది. ఎటువంటి ఫలములు, పుష్పములు లేని "ఫర్ ట్రీ" దిగులుగా నేను ప్రభువుకు ఏమీ ఇవ్వలేని నిష్ప్రయోజనమైన దానిని అని దిగులు చెందుతూ ఉండగా, జాలిపడ్డ ఆకాశ నక్షత్రములు తమ్మును తాము తగ్గించుకొని ఆ "ఫర్ ట్రీ"తో నువ్వేమి దిగులుచెందకు, నీకు మేము అందాన్ని తెస్తాము, నిన్ను ఆలంకరిస్తామని నక్షత్రాలన్నీ కలిసి దిగులుతో ఉన్న ఆ ఫర్ ట్రీకి మెరుపులు పుట్టించి, ప్రతి కొమ్మకు ఆకర్షణీయంగా వ్రేలాడి మిగిలిన అన్నింటి కన్నా అందంగా ఆకర్షణీయంగా దానిని సిద్ధపరచి యేసయ్యను అబ్బురపరచెనట. ఆ కథను ఆధారం చేసుకునే క్రిస్మస్ సందర్భాలలో ఫర్ ట్రీని ఎంతో ఆకర్షణీయమైన లైటింగ్‌లతో, నక్షత్రాలతో అలంకరించటం వలన దానికి "క్రిస్మస్ ట్రీ" అని పేరు వచ్చింది.

చూశారా పిల్లలూ! ఆ నక్షత్రాలు చేసిన పనిని గమనించారా? సృష్టంతా పులకించి పోతూవుండగా ఫలములు, పుష్పములులేక దిగులుతోవున్న ఫర్ చెట్టును మిగిలిన వారెవ్వరూ పట్టించుకోకపోయినా ఆ నక్షత్రాలు తమ సంతోషాన్ని మరచి తమ ఆనందాన్ని విడిచి ఆ "ఫర్ ట్రీ"కి ఆనందాన్ని, సంతోషాన్ని కలిగించినవి. క్రీస్తు జన్మలోవున్న

పరమార్థాన్ని పంచి పెట్టాయి..మనము క్రిస్మస్ అంటే Decoration, Shoppingsకీ ఇచ్చే Important మనతోటి వారి కష్టాలను, ఆపదలను పట్టించుకునేందుకు ఇవ్వము. మీరు చిన్నపిల్లలు, ఎంతో చక్కని మనస్సు కలిగినవారు. మీరంటే ప్రభువుకు ఎంతో ఇష్టం. మీరు మీ Friendsతో చాలా Happyగా ఉంటారు కదా! మరి మీ Friends happyగా ఉంటున్నారో లేదో గమనిస్తున్నారా? వాళ్ళు dullగా ఉంటే వాళ్ళని ఏంటి పరిస్థితి? అని అడిగి తెలుసుకోండి, వారు దేని గురించి బాధపడుతున్నారో తెలుసుకొని అది ఏదైనప్పటికి మీచేతనైన సహాయం మీ పెద్దవారిని అడిగి తెలుసుకొని మీరు చేయాలి. ఫర్‌ట్రీ భూమి మీద ఉంటే ఎక్కడో ఆకాశంలో ఉండే నక్షత్రాలు ఏ విధంగా దాని బాధను గ్రహించాయో అలాగే మీరు కూడా ఎక్కడ ఉన్ననూ అంటే ఆర్థికంగా మీరు Rich Family అయినా ఇబ్బందులలో ఉన్నవారిని గమనించాలి సుమా! నీ సంతోషంకంటే నీతోటి వారి సంతోషం నీవు share చేసుకున్నప్పుడు అది చాలా happyగా ఉంటుంది పిల్లలూ ....చూడండి! ఏ ఆకర్షణ లేని ఆ 'ఫర్ ట్రీ'ని ఈ Christmas daysలో ఎంతో ఆకర్షణీయంగా అలంకరించడంలో దేవుని ఉద్దేశ్యం గ్రహించారా!! చాలా మంది పెద్దలుకూడా దీనిని గమనించరు. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాబట్టి ఆయన అద్వితీయ కుమారుని అనుగ్రహించెను. మనల్ని కూడా ఆయన ప్రేమిస్తున్నాడు కాబట్టే, అంటే పాపులమైన మనలను ఆయన జన్మదినాన అలంకరించడానికి ఇష్టపడుతున్నవాడు ఆయనే. మనకి మంచితనం, దయాగుణం, నీతి లేకపోయినా ప్రభువు పుట్టుక ద్వారా మనకి విమోచన, సంతోషం కలుగచేసే దేవుడు. అనేక మంది క్రైస్తవులవలె మీరు కూడా క్రిస్మస్ పండుగనాడు క్రొత్త బట్టలతో మిమ్మల్ని మీరు అలంకరించుకుంటారో, పిండి వంటలతో మీ కడుపు నింపుకుంటారో లేక ఆ నక్షత్రములవలె ఎవరైతే కొత్తబట్టలకు నోచుకోలేదో, ఎవరైతే పిండి వంటలు చేసుకోలేదో, ఎవరైతే పరిస్థితులనుబట్టి కృంగిపోయి, దిగులుతో పండుగ కూడా నా బ్రతుకునకు దండగ అని తమ్మును తాము నిందించుకుంటున్నారో వారి జీవితాల్లో సంతోషం నింపడానికి క్రీస్తు ప్రేమను పంచడానికి మీరు ప్రయత్నిస్తారని ఆశిస్తూ......

మీ అక్కయ్యా !

**"నేనున్నానని"** ఆడియో సిడి మరియు

**నూతన సంవత్సర క్యాలెండర్-2015** కొరకు

ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీస్ నందు సంప్రదించగలరు.

# "నా జీవితములో దేవుని మేలులు"

సి. హెచ్. పాల్‌రాజ్, అనాజ్‌పూర్

నా జీవితములో జరిగిన సంఘటనలను సాక్ష్యంగా మీ ముందు ఉంచుతున్నాను. మాది నల్గొండ జిల్లా, మర్రిగూడ మండలం, తిరుగండ్లపల్లి గ్రామము. ఇంట్లో నేను పెద్దవాడిని. చిన్నతనములో కరుణామయుడు సినిమా చూడడం ద్వారా యేసుక్రీస్తు ఒక మంచి దేవుడు అనుకున్నాను. అటుతరువాత "నీ జీవితంలో గమ్యం ఎటో" అని పాడుతున్న పాట ద్వారా ఎన్నో ప్రశ్నలు నా మదిలో ఉత్పన్నమయ్యాయి. క్రైస్తవ స్కూల్ హాస్టల్‌లో 9వ తరగతి చదువుచున్నప్పుడు అక్కడ జరిగే ప్రార్థనలు నన్ను ఆకర్షించాయి. 10వ తరగతిలో అందరూ బాప్తిస్మం తీసుకుంటున్నారు అని నేను తీసుకోవడం జరిగింది. 10వ తరగతి అయిపోయిన తరువాత ఇంటికి వచ్చాను. అప్పటి నుండి దుర్వ్యసనములలో మునిగిపోయి తిరుగుచున్నాను. దీనిని గమనించిన మా తల్లిదండ్రులు 18సం॥ల వయసు ఉన్న నాకు 13 సం॥ల అమ్మాయితో వివాహం చేశారు. ఏ మాత్రం మానసిక పరిపక్వత లేని నేను జీవించడం ఎలాగో తెలియక, నా భార్యతో గొడవపడేవాడిని. ఒకసారి భయంకరమైన దగ్గుతో చాలారోజులు బాధపడుతూ ఉండగా, నా భార్య ఇంతకు ముందు యేసుప్రభువుకు ప్రార్థన చేసేవాడివి కదా, ప్రార్థన చేసుకో దగ్గు తగ్గుతుంది అని చెప్పింది. అప్పుడు మా ఊరి నుండి ప్రతి ఆదివారం 15 కి.మీ సైకిల్ మీద ప్రయాణించి చర్చికి వెళ్ళేవాళ్ళము. ఒకరోజు ఉపవాసముండి ప్రార్థన చేసుకోవాలని, నేను నాతో ఉన్న సహోదరులు నిర్ణయించుకున్నాం. ఆ ప్రార్థనలో ఒక మంచి పనిని, ఒక మంచి పరిచర్యని ఇవ్వు ప్రభువా అని ప్రార్థించుకున్నాను. ఎందుకంటే నేను ఏ పని చేయట్లేదు అని నా భార్యను మా అత్తమామలు తీసుకువెళ్ళిపోయారు. ప్రార్థనని దేవుడు ఆలకించి, హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో పని అనుగ్రహించారు. అక్కడ క్వార్టర్స్‌లో ఉంటుండగా శనివారం రోజు ఒక ప్రార్థన పాట వినబడింది. ఇక్కడ ప్రార్థన వాళ్ళు ఉన్నారనుకుంటా అని నేను అక్కడికి వెళ్ళాను. అక్కడ ఉపవాస ప్రార్థన జరుగుతుంది. వాక్యం వినినప్పుడు చాలా సంతోషం కలిగింది. అప్పుడు ఎపఫ్రా అన్నయ్య పరిచయం అయ్యారు. ఆదివారం ఆరాధన భాగ్యలతలో జరుగుతుంది అని చెప్పారు. ఆ తరువాత రోజు అక్కడికి వెళ్ళాను. అక్కడ పరిచర్యలో తోటి సహోదరులు చూపే ప్రేమ, దేవునిలో జీవించాలనే ఆశని కలిగించింది. అలా క్రమముగా ఆదివారపు ఆరాధనలు, శనివారపు ఉపవాస ప్రార్థనలలో పాలు పొందినప్పుడు బైబిల్‌లో ఉన్న దేవుని ఉద్దేశ్యములను వాక్యం ద్వారా తెలిసికొనే అవకాశం కలిగింది. దేవుని విశ్వసించుటలో అటూ, ఇటూగా ఉన్న నా భార్య విశ్వాసములో స్థిరపరచబడింది. అంతమాత్రమే కాకుండా విశ్వాసులైన అనేక మంది సహవాసములో నేను ఒక అవయవమును అనే భావనతో బ్రతికే

ధన్యత కలిగింది. ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు అన్నయ్య వాళ్ళ నాన్నగారి వలన ఎన్నో విషయములు తెలిసికొని, ఆర్థిక క్రమశిక్షణతో జీవించే భాగ్యం కలిగింది. ఆ దినములలో కూలీపని చేసుకుంటూ మేస్త్రీ పని నేర్చుకున్నాను. ఆ మేస్త్రీ పని ద్వారా మన మినిస్ట్రీస్‌లో మందిరములు కట్టడానికి దేవుడు కృప చూపారు. ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే 16సం॥లుగా మాకు పిల్లలు లేరు. ఎన్నో హాస్పిటల్స్, ఎన్నో పరీక్షలు, ఎన్నో స్కానింగ్‌లు వాటన్నిటి కొరకు ఎన్నో డబ్బులు ఖర్చు అయిపోయాయి. వీటన్నిటి కంటే ఎక్కువగా మనుష్యుల సూటిపోటి మాటలు. ఒకరోజు నేను, నా భార్య ఊరు వెళ్ళినప్పుడు ఇద్దరే వస్తున్నారేంటి ? మీ పిల్లలను హాస్టల్‌లో వేశారా ? అని హేళన చేయడం ఈ అవమానములకు పరాకాష్ఠ. అయితే వీటన్నిటి మధ్యలో దేవుడు మమ్మల్ని క్రుంగిపోకుండా కాపాడారు.

ఈ విషయములో కూడా దేవుడు ఒక అద్భుతం చేశారు. అక్టోబర్ నెలలో బాబుని అనుగ్రహించారు. అనేకులు అనేక సంవత్సరముల నుండి చేస్తున్న ఉపవాస ప్రార్థనల ద్వారా మా జీవితములో దేవుడు ఈ అద్భుతం జరిగించారు. బ్రదుకు దినములన్నియు దేవుని యెడల కృతజ్ఞత కలిగి జీవించాలని నా కొరకు, నా కుటుంబము కొరకు ప్రార్థించమని మిమ్ములను వేడుకొనుచున్నాను.

**చందా వివరములు**

సంవత్సర చందా : రూ. 100/-లు.
జీవితకాల చందా : రూ. 2000/-లు.
విదేశములకు : సంవత్సరమునకు US $ 40.

పంపవలసిన మా చిరునామా:
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతినగర్,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500070

# విశ్వాసంలో ఎదుగుట

**మాట్లాడడం ద్వారా విశ్వాసం ఎదుగుతుంది**

వినడం, విధేయత, ప్రేమల మీద సురక్షితమైన విశ్వాసం ఆధారపడి ఉంది. దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు గనుకా మనం ఆయన్ను ప్రేమిస్తున్నాము గనుకా దేవుని స్వరాన్ని విని, దానికి విధేయత చూపే హృదయాన్ని కలిగి యుండడం ద్వారా ఆయన పట్ల మన ఆత్మను సుముఖంగా స్పందించేందుకు సిద్ధంగా ఉంచుతాము. అటువంటి ప్రేమను బట్టే ఆ విశ్వాసం పనిచేస్తుంది. లేనట్లైతే విశ్వాసం ఊపిరాడక, ఎదగడం ఆగిపోతుంది.

విశ్వాసం ఎదగడానికి ముఖ్యమైన మూడు అంశాలు వినడం, లోబడడం ప్రేమించడం. వీటికి ఇప్పుడు ఇంకొక అంశం అది – పలకడం.

మార్కు 11:22,23 లో యేసు తన శిష్యులకు ఇలా నేర్పించాడు. “మీరు దేవుని యందు విశ్వాసముంచుడి.” అక్షరాలా దీన్ని “దేవుని విశ్వాసం కలిగి యుండండి. **ఎవడైనను ఈ కొండను చూచి, నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పిన యెడల”** అని తర్జుమా చేయవచ్చు. ఇక్కడి అంతరార్థమేమిటంటే దేవుని విశ్వాసమంటే మాట్లాడే (పలికే) విశ్వాసం.

ఆదికాండము 1 అధ్యాయములో **“దేవుడు వెలుగు కలుగు గాకయని పలుకగా వెలుగు కలిగెను.”** ‘కలుగును గాక’ అని దేవుడు పలికాడు. అది కలిగింది. దేవుని విశ్వాసమంటే పలికే విశ్వాసం లేదా చెప్పే విశ్వాసం.

పలికే విశ్వాసం, అడిగే విశ్వాసం కంటె ఉన్నతమైనది. అడగాలంటే విశ్వాసం అవసరం. అడగడానికి మించి ముందుకు పోయే విశ్వాసం మరొకటుంది. అది పలికే విశ్వాసం. **“మీరు దేవుని యందు విశ్వాసముంచుడి. ఎవడైనను ఈ కొండను చూచి - నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మిన యెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను”** మూల భాషలో “ఎవడైతే తాను మాట్లాడేది జరుగునని నమ్ముతాడో అతడు ఏమి మాట్లాడినా అది జరుగుతుంది”.

విశ్వాసం యొక్క అభివృద్ధి, ఎదుగుదలా మనం ఏమి మాట్లాడుతున్నామో, లేదా మన నోటి నుండి వచ్చే మాటలతో ఏమి పలుకుతున్నామో దాని మీద ఆధారపడి ఉంది.

సామెతలు 4:20-22 ఇలా చెప్తున్నది: **“నా కుమారుడా, నా మాటలను ఆలకింపుము. నా వాక్యములకు నీ చెవి యొగ్గుము. నీ కన్నుల ఎదుట నుండి వాటిని తొలగి**

**పోనియ్యకుము. నీ హృదయమందు వాటిని భద్రము చేసికొనుము. దొరికిన వారికి అవి జీవమును వారి సర్వశరీరమునకు ఆరోగ్యమును ఇచ్చును."** దేవుని మాటలు మనము పొంది వాటిని పలికితే అవి మనకు జీవమూ, ఆరోగ్యమూ అవుతాయి.

సామెతలు 6:2ను స్పానిష్ తర్జుమాలో ఇలా వ్రాసారు. "నీ నోటి మాటలే నీ మెడకు ఉచ్చులా బిగిసి నిన్ను లొంగదీసుకుంటాయి."

మన నోటి మాటలే మనకు శాపంగానో దీవెనగానో పరిణమిస్తాయని సొలొమోను తేటగా చెప్తున్నాడు. సామెతలు 18:21లో ఇలా సూటిగా చెప్తున్నాడు. **"జీవ మరణములు నాలుక వశము.."**

సామెతలు 10:11లో "నీతిమంతుని నోరు జీవపు ఊట" అని నొక్కి చెప్పి మన నోటి మాటల వలన మనం వలలో చిక్కడమో లేదా మనం చెప్పినదానిని బట్టి విడిపించబడడమో జరుగుతుందని సొలొమోను చెప్తున్నాడు.

"దేవుడు చెప్పినదేమిటంటే" అని పలకడం మొదలుపెడుతుండగా మన విశ్వాసము వ్యక్తమవుతున్నది.

ప్రకటన 12:11లో పరిశుద్ధుల గుంపు విషయం ఉంది. **"వారు గొఱ్ఱెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని (అపవాదిని) జయించి యున్నారు.** "అనగా వారి మాటల్లో ఒప్పుకోలు. దేవుడు చెప్పినదానిని మనం నోటితో పలికినప్పుడెల్లా అపవాది ఓడిపోతుంటాడు.

మాట్లాడిన మాటకు శక్తి ఉందని పౌలుకు తెలుసు. రోమా 10:8-10లో మనలను ఇలా హెచ్చరిస్తున్నాడు. **"వాక్యము నీ యొద్దను, నీ నోటను నీ హృదయములోను ఉన్నది; అది మేము ప్రకటించు విశ్వాస వాక్యమే. అదేమనగా యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా, నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును."**

తొమ్మిదవ వచనంలోని 'రక్షించబడుట' అనే మాట గ్రీకు భాషలో 'సోజో' అనే మాటకు అనువాదం. అంటే "నీకు ఉన్న లోపం తీరుతుంది అని అర్థం. కొత్త నిబంధనలో ఇంకొక వాక్య భాగంలో "నీవు స్వస్థత పొందుతావు" అనే అర్థం ఉంది. ఇంకొక వాక్య భాగంలో "నీ పాపములు క్షమించబడి యున్నవి" అని ఉంది.

దేవుని పిల్లలమైన మనకు అందుబాటులో ఉన్న విమోచన సంబంధమైన ప్రయోజనాలను వ్యక్తపరిచేందుకు 'సోజో' అనే మాటను పరిశుద్ధాత్ముడు వాడుకున్నాడు.

కల్వరిలో మనకు అనుగ్రహించ బడినదంతా మనము ఒప్పుకొన్న దానిని బట్టి తగినట్లుగా ఇవ్వబడుతుంది.

మనమేది చెప్తామో అది మనకు ప్రాప్తిస్తుంది. మనమొక పరిస్థితిని ఎదుర్కోగానే, మన హృదయంలో ఏ స్పందన కలుగుతుందో, ఏది నమ్ముతామో దాన్ని నోటితో పలుకుతాము.

మత్తయి 12:34-37 లో యేసు పరిసయ్యులను ఈ విషయంలో గద్దించాడు. **"హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాట్లాడును గదా... నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు."**

మనం ఈ సూత్రాన్ని సరిగా అర్థం చేసుకున్నట్లైతే, ఇది మనకు అనుకూలంగా కూడా పని చేస్తుంది. దేవుడు మనకు చెప్పిన దానిని మన నోటితో ఒప్పుకుంటే, మన హృదయంలో దాన్ని నమ్మితే, మనం ఏమైతే మాట్లాడుతున్నామో అది మనకు దక్కుతుంది.

సవాళ్ళు ఎదురైన సందర్భాల్లో దేవుని మాటలు మన హృదయాల్లో కాపురమున్నట్టయితే దాన్ని మనం హత్తుకున్నట్టయితే అపజయానికి బదులుగా విజయాన్ని మన నోటితో వెంటనే ఒప్పుకుంటాము. అప్పుడు మనం ఏమైతే చెప్పామో - అదే మనకు కలుగుతుంది!

మాట్లాడే విశ్వాసమునకు ఉదాహరణగా అబ్రాహామును చూడవచ్చు. అనేక జనాంగాలకు తండ్రిగా చేస్తానని దేవుడు అబ్రాహాముకు వాగ్దానం చేశాడు. అప్పటికే 100 సంవత్సరాల వయసులో ఉన్నప్పటికీ, పిల్లలు పుట్టే అవకాశాలు లేకున్నప్పటికీ, అతడు విశ్వాసంలో బలహీనమైనవాడు కాదు. అంతే కాకుండ శారా గర్భం మృతతుల్యమని తెలిసి కూడ అతని విశ్వాసం సన్నగిల్లలేదు. "అవిశ్వాసం వలన దేవుని వాగ్దానమును గూర్చి సందేహింపక, దేవుని మహిమపరచి..."

అంటే దేవుడు తనకు వాగ్ధానం చేసిన రీతిగా దయచేస్తాడని ఒప్పుకుంటూ మహిమ పరుస్తూ సరియైన రీతిలో ఆయనను స్తుతిస్తూ వచ్చాడు. ..."దేవుని మహిమ పరచి, ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి, విశ్వాసము వలన బలము నొందెను." అబ్రాహాము తనలోనున్న పలుకులను బయటికి నోటి మాటల్లో చెప్పాడు. ఎందుకంటే, పరిస్థితులను బట్టి కాక దేవుని మాటనుబట్టే అతడు ఒప్పుకున్నాడు. '.....గనుక అది అతనికి నీతిగా ఎంచబడెను"

– ఇంకా ఉంది (సేకరించబడినది)

# నిజమైన క్రిస్మస్



క్రిస్మస్ సీజన్ వస్తుంది అనగానే ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన సంతోషము. దానికి ఒక ప్రాంతమో, రాష్ట్రమో, లేక దేశమో కాదు కాని భూలోకమంతటా ఇదే భావన. కారణం కొందరికి వారు కొనవలసిన వస్తువులు డిస్కౌంట్స్‌లో దొరుకుతాయి అని అయితే, మరికొందరికి వారి వ్యాపారాలు బాగుగా జరుగుతాయి అని. అనేక దేశాలలో అయితే క్రిస్మస్ సీజన్ పిల్లలకు స్కూల్స్, కాలేజ్‌స్‌లో సెలవులు అనే సంతోషము, వీటన్నింటి వలన ప్రపంచ వ్యాప్తంగా విస్తారమైన ప్రయాణాలు. క్రిస్మస్ సీజన్‌లో ప్రపంచ వ్యాప్తంగా జరిగే వ్యాపారాల లావాదేవీలు సంవత్సరములో మరి ఏ ఇతర సమయములలోనూ జరుగవు అనిఒక సర్వే ప్రకారము తెలియపరచబడింది.

ఇప్పటి వరకు మనము చదువుకున్న విషయముల కంటె ఎంతో ముఖ్యమైన విషయము మరియొకటి ఉన్నది. అది క్రిస్మస్ ద్వారా కలిగే అద్భుతము. ఇది మానవ జీవిత మనుగడనే సమూలంగా మార్చి వేసే విషయం. యేసుక్రీస్తు పుట్టిన దినముగా డిసెంబర్ 25ని జరుపుకుంటూ ఉన్నాము. ఆయన 2000 సంవత్సరముల క్రిందట జన్మించాడు. ఆ సందర్భం భూమి మీద ఉన్న మనుష్యుల జీవితాలను ప్రభావితం చేస్తూ క్రీస్తు శకంగా ప్రారంభమైనది. కంప్యూటర్స్‌లో, క్యాలెండర్స్‌లో అనుదినము మనము ఉపయోగించే తేదీలకు ఆధారము ఆయన జననమే. ఆయన జననము మన అందరి పుట్టుకవలె లేదు కాని మానవ జ్ఞానమునకు కూడా అర్థముకాని రీతిలో కన్య అయిన మరియ అనే స్త్రీ గర్భములో యేసు జన్మించారు. దీనికి కారణం జన్మ, కర్మ పాపములు లేని వాడిగా జీవించి, అట్టి పాప బంధకములలో ఉన్న మానవాళిని పాపముల నుండి విడిపించవలయును అని సృష్టికర్తయైన దేవుని ఉద్దేశమై ఉన్నది. ఆయన పుట్టుటకు పూర్వము వందల సంవత్సరముల క్రితము ఆయన భూమి మీద ఎలా జన్మించనైయున్నాడో దేవ దేవుడు తన భక్తుల ద్వారా

తెలియపరిచినాడు. ఆయన పుట్టుక, జీవితం, సిలువ మరణం, పునరుత్థానము ద్వారా, మానవాళికి గొప్ప విడుదల లేక రక్షణ మార్గము సిద్ధపరచుట దేవుని ఉద్దేశం. ఆయన ఉద్దేశ్యం ఏ విధంగా నెరవేరుతూ ఉందో, ఇంచుమించు 2000 సంవత్సరముల తదనంతరము ఒకసారి పరీక్షించినట్లైతే, నేటి ఇశ్రాయేలు దేశములో ఉన్న యూదయ బేత్లెహేము అనే ప్రాంతములో జన్మించిన యేసు తన ప్రేమ ద్వారా మానవాళి కొరకు ఆయన చేసిన త్యాగము కోటానుకోట్ల ప్రజలను కదిలించి, ఆయనను ఆశ్రయించేటట్లుగా చేసింది. నేటి వరకు ఈ సృష్టిలో ఏ ఒక్కరు చేయని కార్యము దేవదేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మన అందరి కొరకు చేయడం జరిగింది. అది మనుష్యులందరి పాపమునకు పొందవలసిన శిక్షను, నీతిమంతుడైన ఆయన పొంది, మన అందరికి శాంతి, సమాధానము, మోక్షభాగ్యము కలిగించాడు. అందుకే లోకంలో ఎన్ని అడ్డంకులు, అవాంతరములు కలిగిన ఆ దేవదేవుని కార్యము దినదినము ముందుకు వెళ్ళుచు, ఎంతోమంది ఆయనను ఆంగీకరించి ప్రశాంతమైన జీవితం జీవించులాగున నడిపించుచున్నది. అంతమాత్రమే కాకుండా, ఆయన మానవాళికి ఇచ్చిన సందేశాలను స్వీకరించిన వారై ఎంతోమంది వారి ధనమును, జ్ఞానమును, ప్రాణములను కూడా ఖర్చు చేస్తూ ఎన్నో సేవాకార్యక్రమములను నిస్వార్థముగా చేయుచున్నారు. ప్రపంచములో జరుగుచున్న సేవా కార్యక్రమములలో ఎక్కువ భాగము ఆయన సందేశముల వలన కలిగిన స్ఫూర్తే అని చెప్పుకోవచ్చును. ఆయన ప్రేమ సందేశములే లేకపోతే, ఇప్పుడు ఉన్న భూగోళం యొక్క పరిస్థితి ఎంతో దుర్భరంగా ఉండేది.

సృష్టికర్తను గుర్తించని జీవితం ఈ లోకంలో అంధకారమయం. ఏ మనుష్యుడు సృష్టికర్తయైన దేవునిని తెలుసుకొని, యేసు క్రీస్తు ద్వారా కలిగే రక్షణ భాగ్యాన్ని పొందుకుంటాడో అది గొప్ప అద్భుతము. అదే నిజమైన క్రిస్మస్, దానిలోనే వుంది వాస్తవమైన క్రిస్మస్ ఆనందం. ఈ ఆనందము మానవుని జీవితంలో నుండి ఎవ్వరు మరియు ఏది తీసివేయలేదు.

ఈ క్రిస్మస్ సీజన్‌లో అట్టి ఆనందమును ప్రతి ఒక్కరికి దేవుడు దయచేయును గాక !

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

**దేవునిని సంతోషపరచుటకు :**

పూర్ణహృదయముతో సమస్తము దేవునికై చేయుట అనునది సమర్పణా జీవితమునకు ఒక గురుతైయున్నది. ఇది దేవునితో "దేవా, నేను నీకు చెందియున్నాను" అని చెప్పుటయే. మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో ఉన్న పరిశుద్ధాత్మకు ఆలయమై ఉన్నదని మీరెరుగరా ? మీరు మీ సొత్తు కారు, విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి, అని 1 కొరింథి 6:19,20 లో చెప్పబడినట్లుగా, మనం మనకు చెందినవారము కాదు, ఆయన మనలను కొనియున్నాడు అనగా మనం యేసుక్రీస్తు రక్తం అనే వెల ఇచ్చి కొనబడ్డాము. కనుక మన జీవితములు దేవునికి సమర్పించబడినవైనట్లైతే మనకి కలిగిన ప్రతి ఆలోచనను ఉద్ధేశపూర్వకంగా ఆయన ఎదుట ఉంచుతాము. మనము ఆయనను సేవించుటకు, సంతోషపరచుటకు, భూమిపై ఆయన ఉద్ధేశ్యములను విస్తరింపజేయుటకు ఉన్నాము.

కొంతమంది తమ్మును తామే సంతోషపరచుకోవాలనుకుంటారు, ఎవ్వరూ తమని గురించి శ్రద్ధ తీసుకోరు గనుక తమను గురించి తామే శ్రద్ధ తీసుకోవాలని తలుస్తారు. కాని, సత్యమేమిటంటే, దేవుడు మనకు నిజంగా సంతోషకరమైన జీవితమును ఇచ్చి, మన గురించి శ్రద్ధ తీసుకుంటారు. మనం "దేవా, నా సంతోషం కొరకు, నా కొరకు నేను జీవించక, మిమ్ములను సంతోషపరచునట్లు జీవిస్తాను. అలా జీవించినట్లైతే, నా గురించి, నా సంతోషం గురించి మీరు శ్రద్ధ తీసుకుంటారని నేను నమ్ముతున్నాను" అని చెప్పినప్పుడు అదే జరుగుతుంది. మనం మనలను యేసుకు అప్పగించుకున్నప్పుడు, దేవుడు మనకు ఉపకారము చేస్తాడు. మనలను ఆశ్చర్యపరిచే, ఆనందపరిచే విషయములు సంభవించడం ప్రారంభమవుతాయి.

సమర్పణ అనేది ఆశీర్వాదమును తెస్తుంది, ప్రభువునకు మన జీవితం ఇచ్చుట గౌరవమైయున్నది. ఆశీర్వదించబడుటకు మనం దీనిని చేయకూడదు కానీ ఆశీర్వాదములు దీనిని అనుసరిస్తాయి. దేవుడు వాడుకొనునట్లుగా మన జీవితమును వేరుపరచుకొనుట ఆయనకు సంతోషమునిస్తుంది. మరియు దానికి బదులుగా ఆయన మన జీవితమును ఆనందించుటలో సహాయం చేస్తాడు.

దేవుడు మనలను తాను వాడుకొనునట్లుగా వేరుపరచుకొని, మనలో క్రియ జరిగిస్తున్నప్పుడు, మనం సహనం కలిగియుండవలెను. మనతో పని చేయునపుడు ఆయన

 గర్వం శత్రువులను పెంచుతుంది, మిత్రులను దూరం చేస్తుంది.

సమయమును వ్యర్థం చేయడు, కాని మన జీవితములలో లోతైన, సమగ్రమైన పనిని చేయుటకు అవసరమైన సమయమును తీసుకుంటాడు. చాలా మంది విశ్వాసులు దేవుని త్వరపెట్టాలని లేక తమ జీవితములలో ఆయన పని జరిగించుచుండగా దేవునికి సహాయం చేయాలని ప్రయత్నిస్తూ ఉంటారు. అటువంటి శారీరక శ్రమ పూర్తిగా అలసిపోయేటట్లుగా చేస్తుంది. మన హృదయములు దేవునికి సమర్పించినప్పటికీ, ఆయనను ప్రభావవంతంగా సేవించునట్లుగా మనలను దేవుడు శుద్ధిపరచుచుండగా, ఆయన సమయమునకై మనలను మనం అప్పగించుకోవాలి. మనం ఆయన సమయమును అర్థం చేసుకొనలేము, మరియు దాని వలన పరిస్థితులు మరింత అసహనంగా, నిరుత్సాహంగా మారతాయి. అయినప్పటికీ, మనం మన కన్నులు బహుమానంపై ఉంచుకొనవలెను. మనం ఓర్పు చేతను, విశ్వాసము చేతను వాగ్దానములను స్వతంత్రించుకుంటాము అని బైబిల్ చెప్తుంది. (హెబ్రీ 6:12) మన జీవితములను సమర్పించుకొనినప్పుడు మనం దేవుని ఘనపరుస్తున్నాము, దానిని సంపూర్ణంగా చేయు క్రమములో ఆయన ఎంచుకున్న సమయం ప్రకారం సమర్పణా క్రమాన్ని పూర్తి చేయుటకు ఆయనను అనుమతించాలి. అలా చేసినప్పుడు మన జీవితములలో ఆయన సన్నిధి, శక్తి యొక్క గొప్ప బహుమానములను పొందుకుంటాము. మరియు దేవునిచే వాడబడు వర్ణింపలేని అనుభూతిని పొందుకుంటాము. సమర్పణా ప్రార్థనను నిజాయితీగా చేసినప్పుడు ఆ ఫలితం ఎప్పటికీ నిరుత్సాహమును ఇవ్వదు.

సమస్యలు అనేవి జీవితములో భాగములు. కనుక దేవునికి మన సమస్యలను ఇచ్చివేసి, అంటే విషయములను ఆధీనం చేసి, సమస్యల నుండి, ఒత్తిడుల నుండి విడుదల పొంది, ప్రతిదానిలో ఆయనను పనిచేయనివ్వాలి. ఇది మనం నేర్చుకున్నట్లయితే, మనము అత్యంత ఆనందముగాను, విశ్రాంతిగాను ఉంటాము. ఆయన నెరవేర్చలేనంత పెద్ద కార్యం, ఆయన పట్టించుకోలేనంత చిన్న కార్యం ఏదీ లేదు. మనకు సంబంధించిన ప్రతీది ఆయన ఎరిగియున్నాడు. కాబట్టి సమస్తము ఆయనకు ఇచ్చి జీవితములో ఆనందిద్దాము.

ఇంకా ఉంది

(సేకరించబడినది)




# బైబిల్ క్విజ్ -37

(లేవీ, సంఖ్యాకాండము నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** నిర్మలమైన బల్ల మీద ఎన్ని భక్ష్యములు ఉండాలి?

**2.** యెహోవా తమకు ఆజ్ఞాపింపని అగ్నిని ఆయన సన్నిధికి తీసుకువచ్చిందెవరు?

**3.** యూదా గోత్రానికి ప్రధానుడు ఎవరు?

**4.** లేవీయకాండములో ఎన్ని వచనాలున్నాయి?

**5.** ఒక జంతువుకు చీలిన డెక్కలు గలవుగాని అది నెమరువేయదు. దాని పేరేమిటి?

**6.** ఇశ్రాయేలు ప్రజలు ఎక్కడ లెక్కించబడ్డారు?

**7.** 'నీవు మాకు కన్నుల వలె ఉందువు' అని ఎవరి గురించి మోషే చెప్పాడు?

**8.** యాభైవ సంవత్సరం ఏ విధంగా పేర్కొనబడింది?

**9.** అగ్నిచేత ఎవరి కుమారులు కాల్చబడ్డారు?

**10.** దాను గోత్రానికి ప్రధానుడు ఎవరు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిసెంబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి 2015 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**బైబిల్ క్విజ్ – 36 జవాబులు (నిర్గమకాండము నుండి ఇవ్వబడినవి) :**

**1**. లేత పచ్చరత్నాలు (28:9–12)
**2**. రాతి పలకలు (31:18)
**3. మేలిమి బంగారం (37**:17)
**4.** బెసలేలు (31:2–5)
**5. తుమ్మకఱ్ఱతో (25**:10)
**6.** మోషేకు (34:29)
**7. యెహోవా నిస్సీ (17**:15)
**8. సీనాయి పర్వతం (19**:16–18)
**9. తన ప్రజలలో నుండి కొట్టివేయబడును (31**:12–14)
**10.** ఆబీబు నెలలో (34:18)

**బైబిల్ క్విజ్ – 36 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

సుశీల, ఎస్తేరు, స్తెఫను, వాసవ్య, రాజుఫ్లోరెన్స్, త్రినాధరావు, జాన్‌పాల్, లత, నీతా, ప్రసన్న

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత** : సత్యవతి, శ్రీలక్ష్మి, సుధజ్వాల, సరళ, విజయలక్ష్మి, జానకి, శారద, సుధారాణి, విష్ణు, ఉదయ్, అనీష్‌ప్రశాంత్, భానుప్రకాష్, చంద్రసాయి, హెప్సిబా, గౌతమి, దివ్యజ్యోతి, వనితారాణి, వాసన్, సాయికిరణ్, హైమ, మేఘన, ఎలీషా, నిఖిల్‌సూరజ్‌మాథ్యూస్, రమణమ్మ, ప్రవల్లిక, రామకృష్ణ, అభిషేక్, శ్వేత, కనికరమ్మ, కిరణ్‌కుమారి, రూప, సుందర్, స్ఫూర్తి, థామస్, సుఖేషిణి, భవ్యదీపిక, రాజేశ్వరి, గీత, ప్రసాద్, శౌరి, రమేష్, మహేంద్ర, ప్రసన్న, శృతి, అవినాష్, తర్షినా, రాజ్‌కుమార్, అమూల్య, ప్రేమ్‌కుమార్, సువార్తమ్మ, సాల్మన్‌రాజు, అక్షయ్, హేమంత్‌కుమార్, జ్యోతి, సురేంద్ర, ఫిన్నీనోవెల్, అనిల్‌బాబు, అశ్విని, విజ్ఞత, సత్యదుర్గసుప్రజ, చంద్రశేఖర్, కార్తీక్, దుర్గేష్‌నందిని, రాణి, పుష్పలత, శారమ్మ, సుజాత, సృజన, ప్రవీణ్, బాలజ్యోతి, రాంబాబు, మాధవి, లూధియ, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, శిరీషభాను, కిన్నెరమేరి, సతీష్, భాగ్యలక్ష్మి, చంటిబాబు, నవీన్, కరుణ, ఉపేందర్, శోభారాణి, గౌతమి, ఆశీర్వాదమ్, కృష్ణవేణి, ప్రవీణ.

**చింతల్ :** రాజ్‌కిరణ్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వరరావు, రాధిక, సుహాసిని, పావని, దివ్యజ్యోతి, సాల్మన్, ఎస్తేరురాణి, మంజుల, లక్ష్మారెడ్డి

**అనాజ్‌పూర్ :** మరియమ్మ, థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________


మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227


2014, అక్టోబర్ 2వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో
ఎంతో ఆశక్తితో ప్రార్థించుచున్న సహోదరులు.

2014, అక్టోబర్ 2వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో ఎపఫ్రా మెలోడీస్
వాల్యూమ్-3 **"నేనున్నానని"** ఆడియో సి.డి. ఆవిష్కరించుట జరిగినది.








# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras